వణికిస్తున్న జ్వరాలు!

- వాతావరణంలో మార్పులతో విజృంభణ
- కొండరెడ్డి, వలస ఆదివాసీ గ్రామాల్లో బాధితులు
- పారిశుద్ధ్య లోపం, స్ప్రేయింగ్ చేయకపోవడమే కారణమా?



పాత రెడ్డిగూడెంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



పాత రెడ్డిగూడెంలో ఓ ఇంటి వద్ద మురుగునీటి నిల్వ

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజులుగా మారిన వాతావరణం, పారిశుద్ధ్య లోపం, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో దోమల మందు స్ప్రేయింగ్ చేయకపోవడం కారణంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, రక్త కణాలు తగ్గడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఒకరు జ్వరంతో మృతి చెందాడు.

అశ్వారావుపేట మండలంలోని కొండరెడ్ల గ్రామమైన పాత రెడ్డిగూడెం గ్రామంలో 102 గృహాలు ఉండగా.. సుమారు 350 కొండరెడ్ల జనాభ ఉన్నారు. ఈ గ్రామంలో గడిచిన పది రోజులుగా విష జ్వరాలో విజృంభించగా, గ్రామానికి చెందిన ఉమ్మల చిన్న వెంకటరెడ్డి(38) గురువారం రాత్రి జ్వరంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే గ్రామానికి చెందిన ఉమ్మల రాజశేఖర్‌రెడ్డి కుడా రక్త కణాలు తగ్గిపోగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అలాగే ఉమ్మల శ్రీనివాసరెడ్డి, ఉమ్మల వెంకటేశ్వరరెడ్డి అనే అన్నదమ్ములు జ్వరంతో ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. వీరిలో వెంకటేశ్వరరెడ్డికు మలేరియా జ్వరంగా నిర్ధారణ కాగా, శ్రీనివాసరెడ్డికి రక్తకణాలు పడిపోతున్నాయి. ఇదే గ్రామానికి చెందిన మరికొంత మంది జ్వరాల బారిన పడ్డారు. మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉన్న పెద్దమిద్దె, మొద్దులమడ, ఉడుములబండ, దురదపాడు గ్రామాల్లో కుడా జ్వర పీడితులు నమోదు అవుతున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే నలుగురు గిరిజనులు మలేరియా జ్వరాలతో బాధ పడుతున్నట్లు వైద్య శాఖ చెబుతోంది. దీంతో విష జ్వరాలు, మలేరియాతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పిచికారీ ఎక్కడ?

ప్రతి ఏటా వైద్యశాఖ ద్వారా వర్షాకాలం సీజన్‌కు ముందు, ఆ తర్వాత రెండు విడతల్లో మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఇంటింటికీ దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేసేవారు. కాగా, మలేరియా ప్రభావిత గ్రామమైన పాత రెడ్డిగూడెంలో గతేడాది మలేరియా కేసులు నమోదు కాలేదనే సాకుతో, ఈ ఏడాది దోమల నివారణ మందు స్ప్రేయింగ్ జాబితా నుంచి తొలగించారు. దీంతో ఈ గ్రామంలో వైద్య శాఖ దోమల మందు స్ప్రేయింగ్‌ను చేపట్టలేదు. అలాగే దోమ తెరల పంపిణీ సైతం విస్మరించారు. ఈ క్రమంలోనే గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు పడటంతోపాటు, గ్రామానికి అనుకొని అటవీ ప్రాంతం ఉండటంతో దోమలు విజృంభించాయి. స్ప్రేయింగ్ లేకపోవడం, దోమ తెరలు ఇవ్వకపోవడంతో స్థానికులు జాగ్రత్తలు పాటించకపోవడంతో దోమల బారిన పడి, విష జ్వరాలన బారిన పడినట్లు తెలుస్తోంది. అంతేకాదు గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లే కార్యక్రమాలను కూడా చేపట్టడం లేదు. డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోగా, ఇళ్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

హడావుడిగా చర్యలు..

విష జ్వరాలు విజృంభించడం, మలేరియా జ్వరంతో ఒకరు మృతి చెందడంతో స్థానిక వైద్య శాఖ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. గతేడాది మలేరియా ప్రభావిత జాబితా నుంచి తొలగించిన పాత రెడ్డిగూడెంలో తాజాగా కేసులు నమోదు కావడంతోపాటు జ్వర బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో శనివారం వినాయకపురం పీహెచ్‌సీ, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పాత రెడ్డిగూడెం గ్రామంలో ఇంటింటికీ దోమల నివారణ మందును పిచికారీ చేయడం గమనార్హం. కాగా, వైద్యశాఖ నిర్లక్ష్యం కారణంగా జ్వరంతో ఒకరు మృతి చెందగా, ఇంకొంతమంది బాధితులు జ్వరాలతో అల్లాడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

జ్వరాలు వాస్తవమే

మలేరియా జ్వరాలు నమోదు అవుతున్న మాట వాస్తవమే. పరిస్థితి అదుపులోనే ఉంది. ఇప్పటికే అప్రమత్తమై జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాం. దోమల మందు స్ప్రేయింగ్, ఇంటింటి సర్వే చేస్తున్నాం. వర్షా కాలం సీజన్ కావడంతో ప్రజలు జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు, ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి.

– డాక్టర్ రాందాస్ నాయక్, వైద్యాధికారి, వినాయకపురం పీహెచ్‌సీ

పూడికతీత పనులు ప్రారంభం



కోడిపుంజుల వాగు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: గతేడాది ఆగస్టులో కురిసిన వర్షాల కారణంగా మణుగూరులో ముంపునకు గురై 2వేల కుటుంబాలు నష్టపోయినట్లు, భవిష్యత్తులో ముంపునకు గురి కాకుండా రూ.60లక్షలతో కోడిపుంజుల వాగు పూడికతీత పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పనులు ప్రారంభించి మాట్లాడుతూ.. ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి రూ.16,500 అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రతిపథకాన్ని ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది వానకాలం మీద దృష్టి సారించి ముందస్తుగానే పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ రమేష్, ఏఈఈ సత్రు మండల నాయకులు నవీన్, తరుణ్‌రెడ్డి, శివసైదులు, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

మండలంలోని ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ అని అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా–2025 పథకాన్ని నేడు(సోమవారం) ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశం ఇస్తారని స్థానిక ఏడీఏ రవి కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం, అనంతారం, అశ్వారావుపేట, దమ్మపేట మండలంలోని గండుగులపల్లి, మల్లారం, పట్వారీగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెద్దిరెడ్డిగూడెం, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండలంలోని ములకలపల్లి, పూసుగూడెం, పాగళ్లపల్లి, చంద్రుగొండ మండలంలోని చంద్రుగొండ, గానుగపాడు, పోకలగూడెం రైతు వేదికలకు ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులు మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. అలాగే దమ్మపేట మండలం మల్లారం రైతువేదికలో జరిగే కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ హాజరవుతారని ఏడీఏ తెలిపారు.

నియోజకవర్గానికి రూ.91.71కోట్లు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని మొత్తం 48,231 మంది రైతులకుగాను రూ.91.71కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు. అశ్వారావుపేట మండలంలో 13,774 మంది రైతులకు రూ.29.35కోట్లు, అన్నపురెడ్డిపల్లి మండలంలో 5,066 మంది రైతులకు రూ.7.49కోట్లు, చంద్రుగొండ మండలంలో 6,302 మంది రైతులకు రూ.8.57కోట్లు, దమ్మపేట మండలంలో 1,2191 మంది రైతులకు రూ. 25.78కోట్లు, ములకలపల్లి మండలంలో 10,898 మంది రైతులకు రూ.20.52 కోట్ల రూపాయాలు ఆయా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు.

క్లుప్తంగా

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలం పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ తోటమల్ల రమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంబంధిత క్రీడాంశాలలో పోటీలను ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపిస్తామని, ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు వారి వివరాలను ఆన్‌లైన్ ద్వారా tgss.telangana.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రింట్‌ను తీసుకుని ఈ నెల 18న ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద హాజరుకావాలని సూచించారు.

సేవాలాల్ మహరాజ్ విగ్రహావిష్కరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలో ఆదివారం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు స్థానిక మాజీ సర్పంచ్ కునసోతు లింగయ్య, గ్రామపెద్దల చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించి.. ఆ తర్వాత బోగ్ బండారు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లంబాడీల అభివృద్ధి, సంస్కృతి, అభ్యున్నతి కోసం కృషి చేసిన సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని స్థానికంగా ఏర్పాటు చేసుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

భట్టి జన్మదిన వేడుకలు



అశ్వారావుపేటరూరల్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేడుకలు..

సాక్షి నెట్‌వర్క్: డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క జన్మదిన వేడుకలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. భట్టి కలకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంచిపెట్టారు. రాష్ట్రంలో సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి కోసం నిధులను సమకూర్చడంలో డిప్యూటీ సీఎం చేస్తున్న కృషి అభినందనీయం అని పార్టీ పెద్దలు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: మండల గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బచ్చలకూర వీరస్వామి, నల్లగొర్ల ప్రభాకర్‌లు ఎంపికయ్యారు. ఆదివారం మండలంలోని సున్నంబట్టి గ్రామంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో నూతన కమిటీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే గొర్రెల సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని, వర్షాకాలంలో గొర్రెలకు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. మండలంలో ఉన్న గొర్రె కాపరులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నూతన ఉపాధ్యక్షులుగా అంగిరేకుల నాగరాజు, బొల్లి రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా కొండా కృష్ణ బాబు, కందుల నరసింహారావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బంటు శ్రీను, మేకల వీరబాబు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

ఘనంగా పితృ దినోత్సవం

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో పితృ దినోత్సవ వేడుకలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె తన తండ్రి చేత కేక్ కట్ చేయించి తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు విద్యాబుద్ధులు నేర్పించి, సరియైన క్రమశిక్షణ మార్గంలో నడిచేలా చేయడంలో తన తండ్రి పాత్ర మరువలేనిదని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, మడకం రాజేష్, వాసం శ్రీను పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండిలో కుంజా జగన్ శనివారం పిడుగుపడి మరణించగా.. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి, నాయకులు ఆదివారం గ్రామంలోని వారి గృహానికి వెళ్లి జగన్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూరుద్దీన్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

గుండాల: అడవుల్లోని ఖనిజ నిక్షేపాలు, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూసే ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో జూన్ 17న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం గుండాల మండల కేంద్రంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కనిజ సంపద కోసమే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ ఆపరేషన్ కగారును ఆపకపోతే ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని హెచ్చరించారు. న్యూ డెమోక్రసీ నాయకులు కొమరం సీతారాములు, అరెం నరేష్, పర్శక రవి, వజ్జ ఎర్రయ్య, సీపీఐ నాయకులు వాగబోయిన రమేష్, గడ్డం శ్రీను, కాంగ్రెస్ నాయకులు ఈసం పాపారావు, అబ్దుల్ నబీ, బీఆర్ఎస్ నాయకులు తెల్లం భాస్కర్, టి.రాము, గడ్డం రమేష్, గంగాధర నగేష్, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'



పోడుసాగుదారులతో కలిసి సర్వే నోటీస్ పత్రాలు చూపుతున్న రాంబాబు

ములకలపల్లి: పోడు సాగుకు ఆటంకం కలిగిస్తున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు అన్నారు. మాధారం అటవీ ప్రాంతంలోని పోడు భూములను ఆదివారం ఆయన సందర్శించి, సాగుదారులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాధారం శివారులో పోడు భూములపై హక్కు కల్పిస్తామని సర్వే నోటీసులు జారీచేసిన అధికారులు, సర్వే చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఇప్పుడు హక్కుపత్రాలులేవనే సాకుతో సాగుకు ఆటంకం కలిగిస్తున్నారని, పోడు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పోడు సాగుకు అడ్డురావొద్దని, వెంటనే పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీం మండల నాయకులు ఊకంటి రవికుమార్, వినోద్, సాగుదారులు గణప సత్యం, నాగబాబు, సిద్దిని రమణ, లక్ష్మి, రాములమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ప్రగతిపథం



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి

ములకలపల్లి: ప్రధాని మోదీ పాలనలో భారతదేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప సభ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ అధ్యక్షతన ఆదివారం ములకలపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు గొడుగు శ్రీధర్ యాదవ్‌తో కలసి ఆయన కేక్ కేట్ చేశారు. సొసైటీ డైరెక్టర్ చీకటి ప్రకాశ్, ఊకంటి మధుసూదన్ రావు, పూనెం నవీన్, అత్యం మణికంఠ సాయి, పాలకుర్తి ప్రసాద్, కోటోజు రాంబాబు, బాణోతు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలన అమృతకాలం'

అశ్వారావుపేటరూరల్: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన అమృత కాలమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జం శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో 'మోదీ పాలన అమృతకాలం, వికసిత్ భారత్ సంకల్ప'సభను పార్టీ మండల అధ్యక్షుడు మెట్ట వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందిన తీరు అద్భుతమని అన్నారు.

ఆర్టికల్ 370, పెద్ద నోట్ల, ట్రిపుల్ తలాక్ రద్దుతోపాటు వన్ నేషన్ వన్ రేషన్ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేసిన ఘటన మోదీకే దక్కుతుందని అన్నారు. అనంతరం వికసిత్ భారత్ ప్రతిజ్ఞ-2047 ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్‌వీటీ కొండ, పమ్మిడి లక్ష్మీనారాయణ, రాయుడు ఆంజనేయులు, సోలన పుష్కరకుమార్, మద్దాల దేవి, జల్లిపల్లి అరవింద్, నూనె హనుమంతరావు, శీమకుర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ అమృత పాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ పట్టణ కమిటీ నాయకులు ఆదివారం శివలింగాపురంలోని శ్రీనీలకంఠేశ్వస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఈసాల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ భోగే చందర్‌రావు, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల దుర్గారావు, పోతురాజుల శ్రీనివాసరావు, తూము సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

సండే కప్ విజేత రేగుబల్లి జట్టు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని ములకపాడు క్రీడ మైదానంలో 6 జట్లతో ఆదివారం నిర్వహించిన సండే క్రికెట్ పోటీల్లో రేగుబల్లి జట్టు విజేతగా నిలిచింది. ఈ క్రికెట్ పోటీలలో 6 జట్ల క్రీడాకారులు ఉత్తేజంతో పాల్గొన్నారు. హోరాహోరిగా సాగిన పోటీల్లో రేగుబల్లి జట్టు, నడికుడి జట్టులు ఫైనల్‌కు చేరుకోగా ఫైనల్ పోటీలో రేగుబల్లి జట్టు విజేతగా, నడికుడి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ జట్లు నగదు బహుమతులను అందుకున్నాయి. పోటీల్లో సీనియర్ క్రీడాకారులు సుమన్, హేమంత్ బహుమతులు క్రీడాకారులు తాసి, ప్రవీణ్, గోవింద్, చంటి, శివ, దొడ్డ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని రోగులకు, సరోజిని ఆశ్రమంలోని వృద్ధులు, వికలాంగులకు ఆదివారం పండ్లను పంపిణీ చేశారు. పట్టణంలోని కుంజా సత్యవతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మ పుట్టిరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పరిహారం అందేలా కృషి చేస్తా

దమ్మపేట: నాణ్యతలేని, కాపుకురాని ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని పట్వారిగూడెంలో ఆఫ్‌టైప్ మొక్కల ద్వారా నష్టపోయిన రైతుల పామాయిల్ తోటలను మధుసూదన్ రెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతుల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యను అర్థమయ్యేలా వివరిస్తానని అన్నారు. తద్వారా ఆయిల్ ఫెడ్ నుంచి నష్ట పరిహారం అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పామాయిల్ రైతులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కారం శ్రీరాములు, చెలికాని వెంకట్రావు, కోటగిరి రామకృష్ణ, వంకా ముత్యాలరావు, బీజేపీ నాయకులు ఈ.వి రమేష్ ఉడతనేని విశ్వేశ్వరరావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు షేక్ బషీర్(58) మృతదేహానికి ఆదివారం పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈదర సత్యనారాయణను రేగా పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, యూత్ విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, గోపాలకృష్ణారెడ్డి, నయీం పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన 'లిటిల్ ఫ్లవర్స్'



విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలలో చదివిన మొహమ్మద్ సన తబస్సుమ్ ఆల్ ఇండియా 29వ ర్యాంకు, కపూరు జాహ్నవి ఆల్ ఇండియా 164వ ర్యాంక్, బాజీ మోక్షిత ఆల్ ఇండియా 263వ ర్యాంక్‌లు సాధించినట్లు లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థల డైరెక్టర్ మాగంటి శ్రీనివాస వర ప్రసాద్, మాగంటి రమేష్ బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు కళాశాల ఆవరణలో ఆదివారం కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. మెమెంటోలతో సత్కరించారు. మాట్లాడుతూ.. అనుభవం కలిగిన ఉపాధ్యాయుల శిక్షణతో పాటు తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోగల చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అమ్మవారికి మొక్కుబడులు చెల్లించి, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

వానాకాలం బస్సులు బంద్

- రోడ్డుపై గుంతలు.. ఇరువైపులా చెట్లపొదలు
- రాకపోకలకు సాహసించని బస్సులు
- వాహనదారులకూ ఇబ్బందులే..



రోడ్డుకు ఇరువైపులా అల్లుకుపోయిన చెట్లు

గుండాల: గుండాల–మణుగూరు రోడ్డులోని వెంకటాపురం నుంచి రంగాపురం వరకు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కోతకు గురైంది. రెండు మూడు చోట్ల సగం మేర రోడ్డు కోతకు గురైంది. దీంకి తోడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు రోడ్డును కమ్ముకున్నాయి. దీంతో దామరతోగు, సాయనపల్లి పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులున్నా అటవీశాఖ అనుమతి లేదు..

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా ఉంది గుండాల–రంగాపురం రోడ్డు పరిస్థితి. నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి కింద ఏడేళ్ల కింద రూ.28 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. కానీ అటవీ శాఖ అనుమతి లేక పనులు నిలిచిపోయాయి. వర్షాకాలం వస్తుందంటే అప్పటికప్పుడు కొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నప్పటికీ వర్షాలకు మళ్లీ రోడ్డు దెబ్బతింటోంది.

కమ్మేసిన చెట్ల పొదలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా పాడైంది. మరో పక్క గుబురుగా చెట్లు పెరిగి రోడ్డుకు ఇరువైపులా అల్లుకుపోయాయి. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడడం లేదు. ముఖ్యంగా మణుగూరు నుంచి గుండాలకు వచ్చే ఆర్టీసీ బస్సు చెట్ల వల్ల అద్దాలు పగులుతున్నాయి. ఆ కొద్దిదూరం బస్సువెళ్లాలంటే డ్రైవర్ సాహసం చేయక తప్పడం లేదు. ఇటీవల నడిపిన కొత్త బస్సులను నిలిపివేసి మళ్లీ పాత బస్సులనే నడుపుతున్నారు. రాత్రిపూట ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహన దారులు వాపోతున్నారు. ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు.

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో నిత్యం రాకపోకలు ఎక్కువవుతున్నాయి. ఎరువులు, విత్తనాలకు, ఇతర అవసరాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులే. ఈ వర్షాలకు బస్సులు బంద్ అయితే తమ పరిస్థితి ఏంటిని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నియోజక ఎమ్మెల్యేలు రోడ్డు సమస్య మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు మార్లు విన్నవించినా ఏళ్లతరబడి రోడ్డుకు మోక్షం కలగడం లేదని అంటున్నారు. కనీసం డబుల్ రోడ్డు లేకపోయినా సింగిల్ రోడ్డుకు బీటీ వేసినా ప్రయాణం సులభతరం అవుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అవుతోంది. ఇప్పుడు మరమ్మతులు చేపట్టకపోతే ఈ వర్షాకాలంలో ఆర్టీసీ బస్సును సైతం నిలిపివేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి, ఇరువైపులా చెట్లను తొలగించాలని మండల వాసులు వేడుకుంటున్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి

ఈ మధ్య కాలంలో వచ్చిన వానలకు రోడ్డు కోతకు గురైంది. అక్కడక్కడ పెద్దపద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా చెట్ల పొదలు అల్లుకుపోయాయి. వాటిని తొలగించాలి ఈ వర్షాకాలంలో మరమ్మతులు చేపట్టకపోతే బస్సులు నడవడం కష్టం అవుతుంది.

– పాపారావు, దామరతోగు

వినతులు ఇస్తూనే ఉన్నాం..

ఏనాడో రంగాపురం నుంచి గుండాల వరకు ఆర్ అండ్‌బీలో నిధులు మంజూరు అయ్యాయి. అటవీ శాఖ అనుమతి లేక పనులు చేపట్టడం లేదు. గతం నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా బీటీ రోడ్డు వేయించండి.

– సుతారి సత్యం, దామరతోగు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416